హైదరాబాద్ వార్త



# జూబ్లీహిల్స్ కోసం సర్వేలలో మునిగిపోయిన పార్టీలు

**☛గెలుపు గుర్రాల కోసం అన్వేషణ ☛పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారిన ఉపఎన్నిక**




**పంజగుట్ట, జూన్ 30 (ప్రభాతవార్త):**
నగరంలోని జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైన నేపధ్యంలో ప్రధాన పార్టీలు ఇప్పటి నుండే తమతమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. అధికారంలో ఉండడంతో తమకు అనుకూలంగా ఉంటుందని కాంగ్రెస్, సిటింగ్ సీటు కావడంతో తమకే సానుభూతి పవనాలు వీస్తాయని బీఆర్ఎస్, ఇక్కడ బలమైన అభ్యర్థిని నిలబెడితే విజయం ఖాయమని బీజేపీ భావిస్తూ అందుకు అనుగుణంగా నియోజకవర్గంలో అంత ర్గత సర్వేలకు రెడీ అయిపోయాయి. ఇప్పటికే బీఆర్ఎస్ నాయకత్వం ఈ విషయంలో ముందుండి పలువురు నేతల పేర్లను సూచిస్తూ ఈ నేత అభ్యర్థి అయితే ఎలా ఉంటుందనే విషయంలో నియోజకవర్గంలో ఇంటింటికీ సర్వే నిర్వహిస్తున్నారు. అదే విధంగా కాంగ్రెస్ నాయకత్వం కూడా తమ పాలన పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారని ఇప్పటి వరకు చెబుతూ వస్తున్నారు. దీంతో ఇక్కడ విజయం అధికార కాంగ్రెస్‌కు ముఖ్యంగా సీయం రేవంత్‌రెడ్డికి ముఖ్యం. దీంతో పలు రకాల సమీకరణలు, వడపోతలు అనంతరం అధినాయకత్వానికి అభ్యర్థిని సూచించనున్నారు. ఇక బీజేపీ విషయానికి వస్తే ..రాష్ట్ర అధ్యక్షుడిగా రామచంద్రరావు నియామకం జరగడంతో పాటు ఆయనకు నగరంపై పూర్తి అవగాహన ఉండడంతో ఆయన సూచించే అభ్యర్థిపై ఇపుడు బీజేపీ నేతలు చర్చించుకుంటున్నారు. సమీప భవిష్యత్‌లో బల్దియా ఎన్నికలు జరుగనుండడంతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పార్టీలకు ఇపుడు సవాల్‌గా మారింది. దీంతో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేనాటికి అభ్యర్థి విషయంలో ఒక నిర్ణయానికి రావడంతో పాటు ఎన్నికలకు సర్వసన్నద్ధంగా ఉండాలని పార్టీల అధినేతలు ఇప్పటికే నిర్ణయించుకున్నారు. ముఖ్యంగా బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్ ఈ విషయంలో ఒక అడుగు ముందుకువేసి అపుడే ఎన్నికలకు ఒక కమిటీని నియమించి ఆయా డివిజన్‌లలో దివంగత నేత మాగంటి గోపీనాథ్ సంతాప సభలు నిర్వహిస్తున్నారు. అభ్యర్థి ఎవరైనా ఇక్కడ గెలుపు మాత్రం బీఆర్ఎస్ నాయకత్వానికి తప్పనిసరి కావడంతో అధినాయకత్వమే రంగంలోకి దిగి ఇక్కడ ఎన్నికల సన్నాహాలు మొదలుపెట్టారు. ఇక అభ్యర్థి విషయంలో సానుభూతి పవనాలు వీస్తాయని సర్వేలో తేలితే మాగంటి భార్యను రంగంలోకి దింపే అవకాశాలున్నాయి. లేకుంటే ప్రత్యామ్నాయ నేతను వెదకాల్సి ఉంటుంది. పలువురు ఆశావహులు కూడా ఇప్పటికే తమ ఆసక్తిని నాయకత్వం దృష్టికి తీసుకువచ్చినట్లు సమాచారం. ఇక కాంగ్రెస్‌లో టికెట్ రేసులో పదుల సంఖ్యలోఉండడంతో అభ్యర్థి ఎంపిక అధినాయకత్వానికి తలనొప్పిగా మారే అవకాశం కనిపిస్తుంది. పలు రకాల సమీకరణలు చూపుతూ తనకు సీటు కేటాయించాలని ఎవరికి వారే తమ అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరుతున్నారు. గతంలో ఓటమి పాలైన క్రికెటర్ అజారుద్దీన్, నవీన్‌యాదవ్, పి.విజయారెడ్డి, రోహిన్‌రెడ్డి, మాజీ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జట్టి కుసుమ కుమార్‌లతో పాటు ఇద్దరు మైనారిటీ నేతలు కూడా తమకే సీటు కేటాయించాలని కోరుతున్నట్లు సమాచారం. ఇక బీజేపీ విషయానికొస్తే గతంలో పోటీచేసి ఓటమిపాలైన దీపక్‌రెడ్డి, అదే సామాజికవర్గానికి చెందిన ఓ మహిళానేత, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్ తదితరులు టికెట్‌ను ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మైనారిటీలు, సెటిలర్లు ఎక్కువగా ఉండి గెలుపోటములను నిర్ణయించే స్థితిలో ఉన్నారు. దీంతో అధికార కాంగ్రెస్ ఎమ్ఐఎమ్ సహకారంతో ఈ సీటును సునాయాసంగా విజయం సాధించవచ్చని కాంగ్రెస్ నాయకత్వం అంచనావేస్తుంది. అయితే బీజేపీ మాత్రం ఇక్కడ వ్యూహాత్మకంగా కమ్మ సామాజికవర్గానికే కేటాయిస్తే ఎలలా ఉంటుందనే విషయమై ఇప్పటికే ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ఇక్కడ సెటిలర్లలో కమ్మ సామాజికవర్గ ఓట్లు అధికంగా ఉండడంతో వారి ఓట్లు కూడా గెలవడానికి కీలకంగా మారడంతో పార్టీలు ఆ దిశగా కూడా ఆలోచన చేసి అభ్యర్థిని నిలపనున్నాయి. ఏది ఏమైనా పార్టీలు అభ్యర్థి విషయంలో నిర్ణయం తీసుకోవడానికి ఆచితూచి అడుగులు వేస్తున్నాయి.

# ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం జరగొద్దు

**-అధికారులకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆదేశం**



తాము ఆడుకునే పార్కును కాపాడాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న మూసాపేట్‌కు చెందిన బాలుడు

**హైదరాబాద్, జూన్ 30,ప్రభాతవార్త:**
ప్రజావాణి విన్నపాల పరిష్కారంలో జాప్యం జరగకుండా చూడాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమీషనర్ ఆర్.వి.కర్ణన్ తో కలిసి ఆమెపాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... ప్రజల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారంలో జాప్యం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో ముఖ్యంగా పారిశుధ్యం, రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ సమస్యలు, ఆస్తి పన్ను సంబంధిత ఫిర్యాదులు అధికంగా అందినట్లు అధికారులు తెలిపారు. మేయర్ ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను ఓపికగా ఆలకించారు. పౌరులు తమ ఫిర్యాదులను ప్రజావాణికి నేరుగా వచ్చి విన్నవించినా, ఆన్ లైన్ పోర్టల్, మొబైల్ అప్లికేషన్ ద్వారా తమ సమస్యలను తెలియజేసిన అట్టి సమస్యలు కూడా ప్రాధాన్యతనిచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. హైదరాబాద్‌ను మరింత అభివృద్ధి చెందిన నగరంగా మార్చడానికి పౌరుల భాగస్వామ్యం అవసరమని ఆమె పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా కమీషనర్ ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ... ప్రజావాణిలో వచ్చిన విన్నపాలను వేగవంతంగా పరిష్కారం చేయాలని ఆదేశించారు. ఆయా విభాగాల అధికారులు తమ శాఖకు సంబంధించిన విన్నపాలను బాధ్యత వహించాలని, వచ్చిన ప్రతి దరఖాస్తు విషయంలో పరిశీలన చేసి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. జాప్యం చేసిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 71 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 40, ట్యాక్స్ సెక్షన్ 9, శానిటేషన్, విజిలెన్స్ విభాగాలకు 4 చొప్పున, ఇంజనీరింగ్ విభాగం 3, ఫైనాన్స్, ఎస్టేట్, స్పోర్ట్స్, యు.బి.డి, సికింద్రాబాద్ జోన్, కూకట్ పల్లి జోన్, హౌసింగ్ విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులు అందగా, ఫోన్ ఇన్ ద్వారా 4 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు వేణుగోపాల్, సత్యనారాయణ, రఘు ప్రసాద్, సిసిపి శ్రీనివాస్ వివిధ విభాగాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రైవేట్‌కు దీటుగా డిజిటల్ క్లాసులు బోధించాలి

**-గుణాత్మక విద్యను అందించేందుకు టీచర్లు కృషి చేయాలి**
**-జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి**


విద్యాబోధన తీరుపై విద్యార్థిని అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ హరిచందన దాసరి

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:**
ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా డిజిటల్ క్లాసులు బోధించాలని ,గుణాత్మక విద్య అందించే దిశగా ఉపాధ్యాయులందరూ ప్రత్యేక కృషి చేయాలని జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి ఆదేశించారు. సోమవారం ఆసిఫ్‌నగర్‌లో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా వ్యవస్థకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. పాఠశాలలో నీటి ఇబ్బందులు ఉన్నాయని ఉపాధ్యాయులు తెలుపగా సత్వరమే మరమ్మతులు చర్యలు చేపట్టాలని హెచ్ఎండిఏ అధికారులకు సమస్యను వివరించాలని సూచించారు. పాఠశాలలో గల వాటర్ ట్యాంక్ అలాగే మరుగుదొడ్లను ఎప్పడికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. పదో తరగతి పరీక్షలలో 82 శాతం ఉత్తీర్ణులవ్వడంతో ఈ సంవత్సరం కూడా మెరుగైన ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు. పాఠశాల భవన పరిస్థితి, చేపట్టిన టెండర్ ప్రక్రియ వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులందరికి మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం అహర పదార్థాలు అందాలని రుచి చూసారు. పాఠశాల ఆవరణలో ఎన్జీవో ఆధ్వర్యంలో అమన్ వేదిక హోమ్ ద్వారా 60 మందికి పైగా పిల్లలు చదువుతున్నారని ఈ సందర్భంగా కలెక్టర్ కు హెచ్ఎం వివరించారు. ప్రైవేట్‌కు దీటుగా డిజిటల్ క్లాసులో నిర్వహించాలని సూచించారు. తరగతి గదిలో డిజిటల్ క్లాస్ బోర్డ్ పనిచేయకపోవడంతో పాఠశాల హెచ్ఎం పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సత్వరమే వైర్ తోపాటు నెట్ ప్రొవైడ్ చేసి అందుబాటులోకి తీసుకోవాలని ఆదేశించారు. అదేవిదంగా తరగతి గదులను సందర్శించి విద్యార్థితో విద్యా బోధన అందుతున్న తీరును విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. పాఠశాల విద్యార్థి ఓ కళ్యాణ్ రామ్ స్కూల్ గేమ్స్ నేషనల్‌లో 38 కేజీల విభాగంలో స్వర్ణ పథకం సాధించటం అలాగే ఖేల్ ఇండియాలో కూడా పార్టిసిపేట్ చేయటం జరిగిందని తెలపడంతో ఆ బాలుడిని పిలిపించి అతడు సాధించిన విజయాలను చూసి అభినందించి క్రీడల్లో మెరుగైన శిక్షణ అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈవో రోహిణి, డిప్యూటీ డిఇఓ బి వెంకటేశ్వర్లు, హెచ్ఎం షేక్ మొహమ్మద్ సులేమాన్ ఉపాధ్యాయులు ఇతరులు పాల్గొన్నారు.

# మెట్రో రైల్ సంస్థకు అంతర్జాతీయ పురస్కారం



**హైదరాబాద్, జూన్ 30 ప్రభాతవార్త**
జర్మనిలోని హాంబర్గ్ ఇటీవల నిర్వహించిన ప్రతిష్టాత్మక యుఐటిపి- 2025 అవార్డుల కార్యక్రమంలో ఆసియా పసిఫిక్ ప్రాంతానికిగాను ఎల్ అండ్‌టి మెట్రో రైల్ (హైదరాబాద్) లిమిటెడ్‌కు ప్రత్యేక గుర్తింపు పురస్కారాన్ని దక్కించుకుంది. రోడ్స్ అండ్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ (ఆర్టీఏ) తోడ్పాటుతో, ఎల్‌అండ్‌టి ఎంఆర్‌హెచ్‌ఎల్ "ఆప్టిమైజ్డ్ మెట్రో ఆపరేషన్ ప్లాన్స్ లీడింగ్ టు ఇన్‌క్రీజ్డ్ రెవెన్యూ పర్ ట్రెయిన్' ప్రాజెక్టుకు గాను తాజాగా ఈ పురస్కారం లభించింది. ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు (యుఐ టిపి) నిర్వహించే ఈ పురస్కారాల కార్యక్రమం అర్బన్ మొబిలిటీని తీర్చిది ద్దుతున్న పరివర్తనాత్మకమైన ప్రాజెక్టులకు విశిష్ట గుర్తింపునిస్తోంది. గ్లోబల్ నెట్వర్క్ యూఐటీపీలో 100కు పైగా దేశాల నుంచి వివిధ ప్రజా రవాణా మాధ్యమాలకు చెందిన 1,900 ఆర్గనైజేషన్లకు సభ్యత్వం పొందాయి. 2025 ఎడిషన్లో ప్రపంచవ్యాప్తంగా అగ్రగామి ట్రాన్సిట్ ఆపరేటర్ల నుంచి 500 పైగా ఎంట్రీలు వచ్చాయి. ఆపరేషనల్ ఎక్సలెన్స్ కేటగిరీలో హైదరా బాద్ మెట్రో సంస్థ సమర్పించిన ఎంట్రీకి టాప్ 5 ఫైనలిస్టుల షార్ట్ లిస్టులో చోటు దక్కింది. డేటా, సమర్థత ఆధారిత విధానాలకు గాను ప్రత్యేక గుర్తింపు లభించింది. ఈ మేరకు ఇవాళ హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ ఎండీ, సీఈవో కేవీబీ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. యూఐటీపీ నుంచి ఈ ప్రతిష్టాత్మక పురస్కారం పొందడం మాకెంతో గర్వకారణమని తెలిపారు. సమర్థత, ప్రయాణికులకు ఉపయుక్తమైన సొల్యూషన్స్పై మాకున్న నిబద్ధతకు ఇది నిదర్శనంగా నిలుస్తోందన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రభుత్వప్రైవే టు భాగస్వామ్య మెట్రో ప్రాజెక్టు ఆపరేటరుగా, నిర్వహణ సామర్థ్యాలు, పురోగామి వ్యూహాలతో హైదరాబాద్ మెట్రోను ప్రపంచవేదికకు అనుగుణంగా స్మార్ట్ రవాణా ప్రణాళికలను అమలు చేయడమనేది ఇటు వ్యవస్థపై అటు కార్యకలాపాలు నిర్వహిస్తున్న నగరంపై అర్థవంతమైన ప్రభావం చూపగలదనే మా నమ్మకాన్ని ఈ అవార్డు పునరుద్ఘాటిస్తుందని వెల్లడించారు.






# చైతన్యపురిలో అగ్ని ప్రమాదం


అగ్ని ప్రమాదంలో దగ్ధమైన నివాసం

**ఎల్.బి.నగర్ జూన్ 30 ప్రభాతవార్త:**
విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ తో ఓ నివాసంలో మంటలు చెలరేగాయి. ఈ సంఘ టనలో ఓ యువకుడికి గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘ టన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలివి న వివరాల ప్రకారం...చైతన్యపురి డివిజన్ న్యూ మారుతి నగర్ కాలనీలో నివాసముండే శ్రీనివాస్ ఇంట్లో సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించింది. వెంటనే మంటలు చెలరేగడంతో ఇంట్లో ఉన్న వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. దాదాపు రెండు లక్షల వరకు విలువ చేసే గృహో పకరణాలు అగ్నికి ఆవుతైనట్లు ఎల్బీనగర్ ఫైర్ అధికారి శ్రీధర్ తెలిపారు. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ కుమారుడు ప్రణవ్ (22) కు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు, హైడ్రా, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను వ్యా ప్తించకుండా అదుపు చేశారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. సమాచారం అందుకున్న ఐదు నిమిషాల్లోనే ఎల్బీనగర్ ఫైర్ స్టేషన్ అధికారి శ్రీధర్ తన బృందంతో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. సంఘటన స్థలానికి స్థానిక కార్పొరేటర్ రంగ నరసింహా గుప్త చేరుకొని కుటుంబ సబ్యులను ఓదార్చారు. జరిగిన నష్టంపై సంబంధిత అధికారులకు మాట్లాడి న్యాయం చేస్తానని బాధితులకు భరోసా ఇచ్చారు. సరూర్నగర్ డిప్యూటీ కమిషనర్ సుజాత సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# నగరంలో వర్షం.. రోడ్లన్నీ జలమయం

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:**
సోమవారం నగరంలో వర్షం దంచికొంటింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాతావరణం చల్లబడగా రాత్రి పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో బీభత్సం సృష్టించింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, అల్వాల్, తిరుమలగిరి, బొల్లారం, గోల్కొండ, మెహిదీపట్నం, మల్కాజ్‌గిరి, నేరేడ్మెట్, రాజేంద్రనగర్, వికారాబాద్, వెంకటగిరి, యూసుఫ్గూడ, గచ్చిబౌలి, మియాపూర్, ఎల్బీనగర్, దిల్‌షుఖ్‌నగర్‌లలో భారీ వర్షం కురుసింది. దీంతో రోడ్లన్నీ జలమయం అయ్యివాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

# పార్కులు, నాలాలు కబ్జాలపై.. హైడ్రా ప్రజావాణికి 49 ఫిర్యాదులు


ఫిర్యాదులను స్వీకరిస్తున్న హైడ్రా అడిషనల్ డైరెక్టర్ పాపయ్య

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:**
నాలాలు, పార్కులు, రహదారుల ఆక్రమణలపై ఫిర్యాదులు కొనసాగుతున్నాయి. వర్షాకాలం ముంపు ఇబ్బందులు ఎదుర్కొన్నవారు.. అందుకు గల కారణాలను వివరిస్తూ నాలాల ఆక్రమణలపై ఫిర్యాదు చేస్తున్నారు. అలాగే ఒకప్పుడు నిర్మాణుష్యంగా ఉన్న లే ఔట్ల చుట్టూ ఉన్న ప్రహరీలు.. ఇప్పుడు తమ రాకపోకలకు అంతరాయంగా మారుతున్నాయని పలువురు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. లేఔట్లో పార్కులుగా చూపించి వాటిని ప్లాట్లుగా అమ్మేస్తున్నారని.. ప్రజా అవసరాలైన గుడికి, బడికి, కమ్యూనిటీ హాళ్లకు ఉద్దేశించిన ప్లాట్లను కూడా కబ్జా చేస్తున్నారని పలువురు ఫిర్యాదులందించారు. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 49 ఫిర్యాదులందాయి. నాలాలు, పార్కులను ఆక్రమించి భవనాలు నిర్మించి అద్దెలు వసూలు చేస్తున్నారని సంబంధిత పత్రాలతో ఫిర్యాదు చేస్తున్నారు. ఇలా నగరం నలువైపుల నుంచి వచ్చిన ఫిర్యాదులను హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్యగారు పరిశీలించారు. ఫిర్యాదు దారుల ముందే వాటిని సంబంధిత అధికారులకు అప్పగించి తదుపరి చర్యలకు ఆదేశించారు.




## అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

**-కార్పొరేటర్ బొక్క బొక్క భాగ్యలక్ష్మీ**



రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ తదితరులు

**మలక్ పేట ,జూన్ 30, ప్రభాతవార్త:** అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని ముసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ పేర్కొన్నారు. డివిజన్ లోని శాలివాహన నగర్ లో రూ. 6 లక్షలతో నిర్మించనున్న రోడ్డు నిర్మాణం పనులను కాలనీ వాసులతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. డివిజన్ ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.కార్యక్రమంలో శాస్త్రి,చారి, ఉమేష్, సూపర్వైజర్ ముజీబ్ పాల్గొన్నారు.

## పేదల విద్యపైన చిత్త శుద్ధిలేని రాష్ట్ర ప్రభుత్వం

**- కెవిపిఎస్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ప్రకాష్ కారత్**



**తుర్కయంజాల్ జూన్ 30, ప్రభాతవార్త :** కెవిపిఎస్ జిల్లా స్థాయి సామాజిక శిక్షణ తరగతు లు జులై 4,5 తేదీలలో తుర్కయాంజల్ మున్సిపాలిటీ మన్నెగూడ ఎన్ఆర్ఎస్ నగర్ లో 2 రోజుల పాటు జరగబోతున్నవి ఈ క్లాసుల జయప్రదాన్ని కోరుతూ రగన్నగూడ జిల్లా ప్రజాసంఘాల జిల్లా ఆఫీస్ లో విలేకర్ల ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కేవీపీస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొడ సామెల్ మస్కు ప్రకాష్కారత్లు మాట్లాడుతూ.... కేవీపీస్ రంగారెడ్డి జిల్లా స్థాయి సామాజిక శిక్షణ తరగతులు జులై 4,5 తేదీలలో మన్నెగూడా ఎన్ ఆర్ ఎస్ నగర్ కాలనిలో జరగబోతున్నవని ఈ క్లాసులు జయప్రదం చేయాలన్నారు. గురుకులాలను నిర్వీర్యం చేస్తున్నారని బెస్ట్ అవైలబుల్ స్కీం విద్యార్థినీ విద్యార్థులకు నాలుగు సంవత్సరాలుగా పెండింగ్ బిల్లులు ఉండడం వలన జిల్లాలో విద్యార్థులను స్కూల్లో జాయిన్ చేసుకోవడం లేదని ఫీజులు కట్టమని పుస్తకాలు బట్టలు కొనమని ఎంతో మనోవేదనకు యజమాన్యాలు గురిచేస్తున్న అధికారులు పట్టి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. మెరుగైన విద్య అందించుటకు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో దళితుల సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్నామని భవిష్యత్తులో విద్యా వైద్యం ఉపాధి ఇండ్లు ఇళ్ల స్థలాలు ఉపాధి హామీ సమస్యలపై పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీస్ జిల్లా నాయకులు జే ఆశీర్వాదం, యాదగిరి.పి జంగయ్య పగిల్ల మధు, తదితరులు పాల్గొన్నారు.

## బోడుప్పల్ అభివృద్ధికి 34.95 కోట్ల నిధులు మంజూరు



మంత్రి శ్రీధర్ బాబును సన్మానిస్తున్న మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, కొత్త కిషోర్ గౌడ్ , సుమన్ నాయక్

**బోడుప్పల్, జూన్ 30 ప్రభాతవార్త ;** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రోడ్లు,డ్రైనేజీలు,పార్కు అభివృద్ధి చెరువులు సుందరీకరణ కోసం ప్రభుత్వం నుండి 34.95 కోట్ల నిధులు మంజూరైన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఐటి శాఖ మంత్రి జిల్లా ఇంచార్జ్ దుద్దిళ్ల శ్రీధర్ బాబును బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ఆధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్,మాజీ కార్పొరేటర్ భూక్య సుమన్ తదితరులు మంత్రి శ్రీధర్ బాబును కలిసి ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు.భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో బోడుప్పల్ అభివృద్ధికి సహకరించాలనిమంత్రికి విన్నవించారు.

## కాంగ్రెస్ పార్టీలో పనిచేసే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు

**-గ్రేటర్ కాంగ్రెస్ అధ్యక్షుడు సమీవుల్లా**



గ్రేటర్ కాంగ్రెస్ అధ్యక్షులు సమీవుల్లాను సన్మానించి భారత రాజ్యాంగం పుస్తకాన్ని అందజేస్తున్న మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహమ్మద్ షకీల్ తదితరులు

**మలక్ పేట ,జూన్ 30, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసే వారికి పార్టీలో ఎల్లప్పుడు తగిన గుర్తింపు ఉంటుందని గ్రేటర్ కాంగ్రెస్ అధ్యక్షులు సమివుల్ల పేర్కొన్నారు. హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహ్మద్ షకీల్ ఆధ్వర్యంలో మలక్ పేట నుంచి నాయకులు, కార్యకర్తలు కలిసి తరలివెళ్లి సమీ వుల్లాకు పుష్ప గుచ్చాలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి భారత రాజ్యాంగం పుస్తకాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా సమీవుల్లా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించి వారిని చైతన్య పరచాలని సూచించారు. డైరెక్టర్ మహమ్మద్ షకీల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. గ్రేటర్ లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తుల సౌకర్యార్థం ఫోన్‌పే సౌకర్యం



**ఎల్.బి.నగర్, జూన్ 30 ప్రభాతవార్త:** భక్తులకు సౌకర్యంగా ఉండడం కోసం ఫోన్ పేను అందుబాటులోకి తీసుకువచ్చామని దేవాలయం కమిటీ ప్రతినిధులు తెలిపారు. కొత్తపేట మారుతి నగర్‌లోని శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో సోమవారం ఫోన్‌పే సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజు దేవాలయానికి వచ్చే భక్తులు కానుకలు సమర్పించడానికి ఉండితోపాటు ఫోన్‌పే సౌకర్యం సౌలభ్యంగా ఉంటుందని అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయం ప్రతినిధులు రాయుడు, మురళీధర్ రావు, కామేశ్వరరావు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడాన్ని బాధ్యతగా తీసుకోవాలి

**- సీపీ సుధీర్ బాబు ఐపిఎస్**



**నేరేడ్ మెట్, రాచకొండ కమిషనరేట్, జూన్ 30,ప్రభాతవార్త.**
సంతోషంగా చదువుకుంటూ, ఆడుకుంటూ ఉండాల్సిన పిల్లల బాల్యాన్ని పాడుచేసే బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని రాచకొండ కమిషనర్ జి. సుధీర్ బాబు పిలుపునిచ్చారు. ఆపరేషన్ ముస్కాన్ కన్వర్జెన్స్ సమావేశం సోమవారం నేరేడమెట్‌లోని రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, బాల కార్మిక వ్యవస్థ సమాజంలో ఒక వ్యాధిగా మారిందని, ఇది చాలా మంది అమాయక పిల్లల బాల్యాన్ని నాశనం చేస్తోందని అభిప్రాయపడ్డారు. బాల కార్మికులకు మూల కారణం ప్రధానంగా తల్లిదండ్రుల పేదరికం, బలవంతపు భిక్షాటన చేపించే వారి బారిలో చిక్కుకుని వారి బంగారు భవిష్యత్తును కూడా కోల్పోతున్నారని సీపీ అన్నారు. పిల్లల విద్య కోసం ప్రభుత్వం అనేక ఉచిత సంక్షేమ కార్యక్రమాలు మరియు పథకాలను అందిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సీపీ సూచించారు. బాల కార్మికుల నిర్మూల నలో ప్రజల భాగస్వామ్యం ఉండాలని, దీనిని ప్రజలు కూడా తమ నైతిక బాధ్యతగా పరిగణించాలని ఆయన అభిప్రాయపడ్డారు.రాచకొండ నుండి మానవ అక్రమ రవాణా మరియు బాల కార్మికులను నిర్మూలించడానికి కఠినమైన చర్యలు తీసుకుంటున్నట్లు సీపీ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిసిపి మహిళా భద్రతా టి. ఉష, సిడబ్ల్యుసి చైర్ పర్సన్లు నరేందర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా, ఎ.ఎం. రాజారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, శ్రీమతి బి. జయశ్రీ, యాదాద్రిభోంగిరి జిల్లా, శ్యామ్ ప్రసాద్, ఆర్‌డిఓ, మల్కాజ్‌గిరి, నర్సింహారావు, డిడబ్ల్యుఓ, యాదాద్రిభోంగిరి జిల్లా,పూర్ణ చందర్, ఎడి ఓ/ఓ డిఇఓ, విద్య, ఆర్.ఆర్. జిల్లా, డాక్టర్ జి. శోభా రాణి, డిప్యూటి డిఎంహెచ్ఓ, మేడ్చల్‌మల్కాజ్ గిరి, డాక్టర్ గీత, డిప్యూటి డిఎంహెచ్ఓ, రంగారెడ్డి జిల్లా, శ్రీ ఎ. వెంకటేశ్వర్లు, అసోసియేషన్ ఫర్ వాలంటరీ యాక్షన్ కోఆర్డినేటర్, మేడ్చల్‌కు చెందిన డీసీపీ ఇంత్యాజ్ రహీమ్, రంగారెడ్డికి చెందిన డి సి పి ఓ ప్రవీణ్ కుమార్ యాద్రాద్రి జిల్లాకు చెందిన డి సి పి ఓ కవిత, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సాయి సుమన్, ఏ హెచ్ టి యూ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎస్. దేవేందర్, అన్ని రెవెన్యూ, హెల్త్, ఎడ్యుకేష న్, లేబర్ డిపార్ట్‌మెంట్ల అధికారులు, ఎన్ జి ఓ చైల్డ్‌లైన్ మరియు (9) డివిజనల్ టీమ్ ఆఫీసర్లు, ఏ హెచ్ టి యూ సిబ్బంది పాల్గొన్నారు.

## మార్కెట్లను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నాం

**-ఇన్‌చార్జి ఎస్‌జిఎస్ చిలుక నరసింహారెడ్డి**

**మలక్ పేట, జూన్ 30, ప్రభాతవార్త :** మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ లో హమాలీలు, చాట కూలీలు, కార్మికులకు రెండు జతల యూనిఫామ్ లు, ఐడి కార్డులు, లైసెన్సుల మంజూరుకు రూ.10 లక్షలు కేటాయిస్తూ పాలకవర్గ సభ్యులతో కలిసి నిర్ణయం తీసుకోవడం జరిగిందని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ ఫుల్ అడిషనల్ ఛార్జ్ ఉన్నత శ్రేణి కార్యదర్శి చిలుక నరసింహారెడ్డి తెలిపారు. మార్కెట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్కెట్లో నెలకొని ఉన్న అపరిష్కృత సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని, అందులో భాగంగా డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు జలమండలి ఉన్నతాధికారులను కలిసి సమస్యను వివరించడం జరిగిందని ఆయన తెలిపారు. అదేవిధంగా మార్కెట్లో రైతులకు, వ్యాపారులకు, వివిధ అవసరాల నిమిత్తం మార్కెట్ కు వచ్చే కొనుగోలుదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. మార్కెట్లో బి ఓ టి (బిల్డ్ ఆన్ టాక్స్) విధానం ద్వారా మరుగుదొడ్లను నిర్మించనున్నామని ఆయన తెలిపారు. మార్కెట్ అభివృద్ధికి పాలకవర్గ సభ్యులతో కలిసి సమిష్టి నిర్ణయాలు తీసుకుంటున్నామని, రైతులకు మద్దతు ధరలు కల్పిస్తూనే, వ్యాపారులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా మార్కెట్ ఆదాయం పెంచేందుకు కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు.
వీలైనంత త్వరగా మార్కెట్‌లోని అన్ని సమస్యలను పరిష్కరించి మెరుగైన వసతులతో మార్కెట్ ను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నానని ఆయన తెలిపారు

## ఆర్కేపురంలో ఘనంగా ముగిసిన శ్రీజగన్నాథ రథయాత్ర



రథయాత్రలో పాల్గొన్న మధురఉపేందర్‌రెడ్డి, గణేష్ నేత, శ్రీనివాస్

**ఎల్.బి.నగర్, జూన్ 30 ప్రభాతవార్త:** ఆర్కేపురంలో శ్రీజగన్నాథ రథయాత్ర కార్యక్రమం సోమవారం ఘనంగా ముగిసింది. ఆర్కేపురం, ఇన్‌కమ్‌టాక్స్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు, సరూర్‌నగర్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ, అబిట్స్ ఇస్కాన్ వారి ఆధ్వర్యంలో శ్రీనివాస ప్రభూజీ, నర్సింహరావు ప్రభూజీ నేతృత్వంలో శ్రీజగన్నాథ రథయాత్రను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సర్వశ్రీ శ్రీదత్తేశ్వరానంద భారతి స్వామి, తదుపరి ఉత్తరాధికారి శ్రీకుర్తాళ పీఠం సమక్షంలో దీపారాధన నిర్వహించి రథయాత్రను ప్రారంభించారు. ఈ రథయాత్రను ఆర్కేపురం నుండి ప్రారంభమై శ్రీప్రతంగిరాదేవి ఆలయం, వారాహిప్రత్యంగిరాదేవి ఆలయం, శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయం, శ్రీసాయిబాబాఆలయం, శ్రీఅష్టలక్ష్మీ ఆలయాలను సందర్శించి, వాసవికాలనీ ఆధ్యాత్మిక కేంద్రం వరకు వేడుకగా కొనసాగింది. వేలాదిమంది భక్తుల కోలాహలం మధ్య రథయాత్ర సాగడంతో కాలనీలోని వీధులన్నీ ఆధ్యాత్మికతతో నిండిపోయి పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించడంలో ముఖ్య పాత్ర పోషించిన చిలుక మధుర ఉపేందర్ రెడ్డి సహకారం అమూల్యమైందన్నారు. ఆర్కేపురంలో సనాతన ధర్మ ప్రచారం అభినందనీయమన్నారు. శ్రీజగన్నాథుని రథయాత్ర ఆధ్యాత్మికంగా ఎంతగొప్పదో విశేషంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాధధీరజ్‌రెడ్డి, పున్న నిర్మల గణేష్‌నేత, ప్రత్యంగిరా దేవాలయం సెక్రెటరీ మునిపల్లె శ్రీనివాస్, రాజశ్రీరామారావు, వెంకటేశ్వర్లు, గణేష్, రాజేశ్, అన్నపూర్ణ, భాస్కర్, నరహరిరావు, గణేశ్‌బాబు, శ్రవణ్, కిరణ్ కుమార్, హరీష్, రమేష్‌బాబు, వంశీ, విజయలక్ష్మీ, సుజాత, స్వర్ణలత, స్వప్న, అర్చన, రాణి, పుష్ప, మాధవి లలిత తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమం వెనుక అధికారుల పాత్ర ఉంటుంది : సబితా ఇంద్రారెడ్డి



పదవీ విరమణ పొందిన మీర్‌పేట్ కమీషనర్ జ్ఞానేశ్వర్ దంపతులను సన్మానిస్తున్న సబితా ఇంద్రారెడ్డి, టియుఎఫ్ఐడిసి ఛైర్మన్ చల్లా నర్సింహారెడ్డి

**సరూర్‌నగర్, జూన్ 30 ప్రభాతవార్త:** అభివృద్ధి, సంక్షేమం వెనుక అధికారులు పాత్ర ఉంటుందనీ సమర్ధవంతంగా పని చేసే అధికారులు ఎప్పుడూ గుర్తుంటారని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్‌గా పని చేస్తున్న రెడ్డిపల్లి జ్ఞానేశ్వర్ సోమవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా జిల్లెలగూడ ఆర్‌సిఐ రోడ్డులోని సామ యాదిరెడ్డి కన్వెన్షన్స్‌లో కనుల పండువగా జరిగిన పదవీ విరమణ వీడ్కోలు అభినందన సభకు సబితారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ దంపతులను సబితా ఇంద్రారెడ్డి, టియుఎఫ్ఐడిసి ఛైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లకు చెందిన పలువురు మాజీ కార్పొరేటర్లు, ఉద్యోగులు, వివిధ పార్టీల నాయకులు శాలువాలు, పుష్పగుచ్ఛాలు, పూలమాలలతో సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్, తుక్కుగూడ, మీర్‌పేట్‌లలో కమీషనర్‌గా పని చేసిన జ్ఞానేశ్వర్ మంచి పేరుతో పదవీ విరమణ పొందడం అభినందనీయమన్నారు. కొత్త ఒరవడితో మున్సిపాలిటీల్లో సానిటేషన్‌లో మంచి మార్పులు జ్ఞానేశ్వర్ తీసుకొచ్చారని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిడిఎంఎ జాయింట్ డైరెక్టర్లు ఫల్గుణ్‌కుమార్, పి.శ్రీధర్, తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కమీషనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణమోహన రెడ్డి, కమీషనర్లు సుమన్‌రావు, వాణిరెడ్డి, శరత్‌చంద్ర, సింగటి వెంకటేష్, చంద్రప్రకాశ్‌రెడ్డి, అంజన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సరస్వతి, అసిస్టెంట్ కమీషనర్లు డి.చంద్రశేఖర్‌రెడ్డి, నాగేందర్‌రెడ్డిలతో పాటు పలువురు అధికారులు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## త్వరలోనే సీఎం చేతులమీదుగా కోహెడా మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన

**-గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ సమీక్షా సమావేశంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**



**అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 30, ప్రభాతవార్త :** అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యాధునిక వసతులతో కోహెడాలో నిర్మించమబోయే ఆసియాలో అతిపెద్ద మార్కెట్ నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరుగనున్నదని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డిరంగారెడ్డి పేర్కొన్నారు. కోహెడా మార్కెట్ నిర్మాణం పూర్తయితే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు రైతులకు, వ్యాపారులకు, ప్రజలకు ఉపయోగకరంగా మారనున్నదన్నారు. సోమవారం బాటసింగారం పండ్ల మార్కెట్ కార్యాలయంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మార్కెట్‌కు సంబంధించిన కార్యక్రమాలతో పాటు త్వరలో చేపట్టబోయే కోహెడ మార్కెట్ నిర్మాణ ప్రాజెక్టు పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ రైతు సంక్షేమమే సర్కారు ఉద్దేశ్యమని మార్కెట్ కి వచ్చే ప్రతి రైతుకు న్యాయం చేసేలా పాలకవర్గం పనిచేయాలని సూచించారు. అధిక కమిషన్లు వసూలు చేసే మార్కెట్ వ్యాపారులను బ్లాక్ లిస్టులో పెట్టి అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. గత ప్రభుత్వం బాటసింగారం లాజిస్టిక్ పార్క్ లో పండ్ల మార్కెట్ ను ఏర్పాటు చేసిన సమయంలో కొంతమంది భూములను మరియు షెడ్స్‌లను అధిక అద్దెకు మార్కెట్ కి ఇచ్చారని తక్షణమే అద్దెలను తగ్గించాలని లేని పక్షంలో మార్కెట్ పాలకవర్గం ఆధ్వర్యంలో వాటి స్థానంలో కొత్త షెడ్ల నిర్మాణాన్ని చేపడుతుందన్నారు. ఎన్టీఆర్ నగర్ మార్కెట్ ముందు కొంతమంది దళారులు వ్యాపారం చేస్తూ మార్కెట్ ఆదాయానికి గండి కొడుతున్నారని మార్కెట్‌లో విక్రయించుకునే ప్రతి రైతుకు అవకాశం కల్పిస్తామని, చెక్‌పోస్ట్‌లు పెట్టి దళారులను అడ్డుకునే విధంగా పాలకవర్గం చర్యలు తీసుకోవాలన్నారు. మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ లక్ష్మణుడు, రీజినల్ జాయింట్ డైరెక్టర్ రవికుమార్, జిల్లా మార్కెటింగ్ అధికారి మహమ్మద్ రియాజ్, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎల్, శ్రీనివాస్ తో పాటు వైస్ ఛైర్మన్ భాస్కర్‌చారి, డైరెక్టర్లు జైపాల్‌రెడ్డి, మధుసూదన్‌రావు, అంజయ్య, లక్ష్మీ, మచ్చేందర్ రెడ్డి,రఘుపతి రెడ్డి,గణేష్ నాయక్, గోవర్ధన్ రెడ్డి,నవరాజ్,నర్సింహ,వెంకట్ గుప్తా,ఇబ్రహీం పాల్గొన్నారు.

## ఎస్‌జిఎస్ మూర్తికి ఎసిసిఐ(1) ఎమినెంట్ ఇంజనీర్ అవార్డు

**పుదుచ్చేరి సిఎం చేతుల మీదుగా పురస్కారం అందజేత**

**సరూర్‌నగర్, జూన్ 30 ప్రభాతవార్త:** హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ ఎస్‌జి శ్రీనివాసమూర్తికి ప్రతిష్టాత్మక ఎసిసిఇ(1) ఎమినెంట్ ఇంజనీర్ అవార్డు లభించింది. సివిల్ ఇంజనీరింగ్‌లో సీనియర్ ప్రొఫెసర్ అయిన విశ్రాంత ఎస్‌జిఎస్ మూర్తి విశేష ప్రతిభకు జాతీయ స్థాయిలో ఈ పురస్కారం దక్కింది. ఈ నేపథ్యంలో పుదుచ్చేరిలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి చేతుల మీదుగా మూర్తి పురస్కారాన్ని అందుకున్నారు. అవార్డు లభించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం



సిర్జాదిగూడ సాయి హిల్స్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ దొంతిరి హరి శంకర్ రెడ్డి,కాలనీవాసులు

**మేడిపల్లి, జూన్ 30 ప్రభాతవార్త ;**
పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 25వ డివిజన్ సాయి హిల్స్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజి , యు డి జి పనులను మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులను కాలనీ వాసులతో పరిశీలించారు.ఈ సందర్భంగా హరిశంకర్ రెడ్డి మాట్లాడుతూ... 25వ డివిజన్లో మిగిలిపోయిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ,సిసి రోడ్లు మొదలగునవి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తెస్తానని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో సాయి హిల్స్ కాలనీ అధ్యక్షులు మధుసూదన్, ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి, కాలనీ వాసులు మహేందర్, సత్యనారాయణ, రాంలింగ రెడ్డి, భానుశేఖర్, రాజి రెడ్డి,శ్రవణ్, హరి, రాకేష్ రెడ్డి,రమేష్ రెడ్డి, మహేష్, రాములు, ప్రవీణ్, భాను, రంజిత్, మున్సిపల్ వర్క్ ఇన్స్పెక్టర్స్ లింగ స్వామి,నవీన్ రెడ్డి, మనోహర్ పాల్గొన్నారు.

## ఎఫ్‌సిఐ కాలనీ ఎన్నికల్లో ఆది నరసింహారావు ప్యానల్ ఘన విజయం



ఎఫ్‌సిఐ కాలనీ నూతన కమిటీ ప్రతినిధులు.

**వనస్థలిపురం. జూన్.30.ప్రభాతవార్త :** వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ఎఫ్.సి.ఐ. కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికలలో ఆది నరసింహారావు ప్యానల్ ప్రతినిధులు ఘన విజయం సాధించినట్లు ఎన్నికల అధికారులు గా వ్యవహరించిన రవీంద్రా చారి, కె.రాఘవ రెడ్డి లు తెలిపారు. నూతన అధ్యక్షుడిగా ఆది నరసింహారావు, ఉపాధ్యక్షుడు గా ఈరటి రాజు యాదవ్,ప్రధాన కార్యదర్శి గా సలుకూటి చంద్రశేఖర్ రెడ్డి, ఫైనాన్స్ సెక్రెటరీ గా వడ్డేపల్లి సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శులు గా డాక్టర్. వేముల కృష్ణారావు, పల్లే వాణి, కార్యవర్గ సభ్యులు గా జక్కా అనురాధ రెడ్డి, గజ్జెల ఝాన్సీ లక్ష్మీ,కందాల యాదిరెడ్డి, కస్తూరి మురళీ కృష్ణ,మల్లబోయిని మాల్యాద్రి, భత్తార్ రాఘవాచారి లు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో గెలిపించిన కాలనీవాసుల కు కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా కాలనీ అభివృద్ధి కి కృషి చేస్తామన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో కాలనీలో మిగిలిన అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు.

## అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలి : కార్పొరేటర్



విద్యార్థులకు నగదు పురస్కారాలు అందిస్తున్న కార్పొరేటర్ కుటుంబ సభ్యులు.

**హయత్ నగర్, జూన్ 30 ప్రభాతవార్త :**
విద్యార్థులు కష్టపడి చదవాలని... అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి సూచించారు. ఆయన తండ్రి కళ్లెం పెంట రెడ్డి నాల్గవ వర్ధంతిని పురస్కరించుకొని 2024 25 విద్యాసంవత్సరానికి గాను పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు ఆయన సోమవారం నగదు ప్రోత్సాహకాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కి తన వంతు సహకారం అందిస్తానని తెలియరు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, కళ్లెం శంకర్ రెడ్డి, కళ్లెం జయవర్ధన్ రెడ్డి,పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ నక్క దర్శన్ గౌడ్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## క్రీడాకారిణిలను అభినందించిన మల్ రెడ్డి రాంరెడ్డి



జాతీయ హ్యాండ్ బాల్ ఛాంపియన్ షిప్‌కు ఎంపికైన నాగ సాయి హంసిక,తనీషా లను అభినందిస్తున్న మల్ రెడ్డి రాంరెడ్డి.

**వనస్థలిపురం. జూన్.30.ప్రభాతవార్త**
గుజరాత్ హ్యాండ్ బాల్ అసోసియేషన్ జూన్ 29 నుండి జూలై 3 వరకు బుజ్ కాబ్ లో నిర్వహిస్తున్న 54 వ సీనియర్ మహిళల జాతీయ హ్యాండ్ బాల్ ఛాంపియన్ షిప్ 2025 లో పాల్గొనడానికి రంగారెడ్డి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ నుండి కెప్టెన్. సి.ఎచ్.నాగ సాయి హంసిక,వైస్ కెప్టెన్. కొమ్ము తనీషా లు ఎంపికయ్యారు.ఎంపికైన క్రీడాకారిణి లను తెలంగాణా రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, రంగారెడ్డి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. వెంకట్రామిరెడ్డి లు రాంరెడ్డి కార్యాలయంలో అభినందించారు. క్రీడలలో రాణించి, తెలంగాణా కు మంచి పేరు తీసుకురావాలని మల్ రెడ్డి రాంరెడ్డి క్రీడాకారిణి లను ప్రోత్సహించారు.

## మీర్‌పేట్ ఇంఛార్జి కమిషనర్‌గా వాణిరెడ్డి

**సరూర్‌నగర్, జూన్ 30 ప్రభాతవార్త:**
మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఇంఛార్జి కమీషనర్‌గా వాణిరెడ్డిని నియమించారు. ఇక్కడ పని చేస్తున్న ఆర్.జ్ఞానేశ్వర్ సోమవారం పదవీ విరమణ చేయడంతో మీర్‌పేట్ ఎంసి ఇంఛార్జి బాధ్యతలను వాణిరెడ్డికి అప్పగించారు. ప్రస్తుతం ఆమె మహేశ్వరం నియోజకవర్గంలోనే తుక్కుగూడ మున్సిపాలిటీ కమీషనర్‌గా పని చేస్తున్నారు. అక్కడ పూర్తి స్థాయి కమీషనర్‌గా కొనసాగుతున్న ఆమె మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు కొత్త కమీషనర్ నియమితులయ్యే వరకు ఇంఛార్జిగా పని చేస్తారు.

## మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావుకు శుభాకాంక్షలు తెలిపిన బండ కార్తీక చంద్రారెడ్డి



రాంచందర్‌రావును జ్ఞాపికను అందజేస్తున్న బండ కార్తికరెడ్డి

**తార్నాక, జూన్ 30 ప్రభాతవార్త :** బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి చేపట్టబోతున్న మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు కు ఆ పార్టీ నాయకుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. సోమవారం రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా నామినేషన్ దాఖలు చేయడానికి ఇంటి నుంచి బయలుదేరుతున్న రామచందర్ రావును మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి ముందస్తుగా శుభాకాంక్షలు తెలియజేశారు. తార్నాక ప్రాంతానికి చెందిన రామచందర్ రావు అధ్యక్ష పదవి కట్టబెట్టడంపై కార్తీక రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ, జాతీయ నాయకత్వానికి రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం రామచందర్‌తో కలిసి నాంపల్లిలోని రాష్ట్ర కార్యాలయానికి కార్తీక రెడ్డి బృందం తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ అసెంబ్లీ కన్వీనర్ కందాడి నాగేశ్వర్ రెడ్డి, తార్నాక డివిజన్ అధ్యక్షులు ఉపేందర్ యాదవ్, జిల్లా కార్యదర్శి మల్లికంటి వీరన్న,కొన్నె సంపత్‌తో పాటు సికింద్రాబాద్ నియోజకవర్గ నాయకులు ఉన్నారు.

## సీఎంఆర్ఎఫ్ ద్వారా ఎంతో మందికి మేలు



సీఎం ఆర్ఎఫ్ చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న కార్పోరేటర్ పన్నాల

**నాచారం, జూన్ 30 ప్రభాతవార్త :** ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో సీఎం సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను సోమవారం కార్పోరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి పంపిణి చేశారు. మల్లాపూర్ డివిజన్ కు చెందిన లబ్ధిదారులు అమిదల వెంకటేష్ కూ. రూ. 60 వేల రూపాయలు, బి.అశోక్ రెడ్డి రూ. 54 వేల రూపాయల చెక్కులను మల్లాపూర్ డివిజన్ వార్డ్ కార్యాలయంలో లబ్ధిదారులకు కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫైళ్ల ప్రవీణ్ కుమార్, దుల్మిట్ట దయాకర్ రెడ్డి, భూమండ్ల శ్రీశైలం, చినింగల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి కరాటే పోటీల విజేతలకు అభినందన



కరాటే పోటీల విజేతలను అభినందిస్తున్న సినీ నటుడు సుమన్

**సైదాబాద్, జూన్ 30 ప్రభాతవార్త:** సల్యూట్ మాస్టర్ అకాడమీలో శిక్షణ పొంది గత నెల 18వ తేదీన అహ్మదాబాద్‌లో జరిగిన కియో జాతీయ స్థాయి కరాటే పోటీలలో సత్తా చాటి పతకాలను సాధించిన విజేతలకు చంపాపేట డివిజన్ సాయిరాం కాలనీలో ఆదివారం సాయంత్రం అభినందన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీ నటుడు సుమన్ హాజరయ్యారు. కరాటే పోటీల విజేతలు చైతన్య వర్ధన్, శ్రద్ధ, ప్రహాసిని, అర్జున్, ప్రణీత్‌లను సినీ నటుడు సుమన్, ఎల్బినగర్ ఎసిపి కృష్ణయ్య, కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయ పాలకమండలి మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డిలు అభినందించారు.కార్యక్రమంలో కరాటే కోచ్‌లు శిహన్ కనకరాజు, సెన్సీ జె.ప్రవీణ్ కుమార్, బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ముదుపు రాజిరెడ్డి, నిర్వాహకులు చందు యాదవ్, బిఆర్ఎస్ యువజన విభాగం ఎల్బినగర్ అధ్య క్షుడు రవి ముదిరాజ్, మల్లేష్‌గౌడ్, కాలనీవాసులు చంద్ర శేఖర్‌రెడ్డి, ముకుందరెడ్డి, చంద్రపాల్‌రెడ్డి, సురంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

## సైదాబాద్‌లో వైభవంగా జగన్నాథ రథయాత్ర



జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, జూన్ 30 ప్రభాతవార్త:** దిల్‌సుఖ్‌నగర్ భక్తి కుటీర్ శాఖ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్రను ఘనంగా నిర్వహించారు. ఎస్‌బిహెచ్ కాలనీ నుండి ప్రారంభమైన రథయాత్ర వెంకటాద్రినగర్ వరకు కొనసాగింది. ఇస్కాన్‌కు చెందిన ప్రణవానంద ప్రభు ప్రవచనాలు చేశారు. సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చి రథయాత్రలో పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి : యెల్మేటి అమరేందర్‌రెడ్డి



బాలాపూర్ సాయినగర్ బోనాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యెల్మేటి అమరేందర్‌రెడ్డి

**సరూర్‌నగర్, జూన్ 30 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని గ్రామాలలో జరిగే బోనాల పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని టిపిసిసి మాజీ కార్యదర్శి, ఉమ్మడి రాష్ట్రంలో కాంటెస్టెడ్ ఎమ్మెల్యే యెల్మేటి అమరేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర మహోత్సవం జరిగే రోజే మహేశ్వరం నియోజకవర్గంలో ప్రథమంగా జరిగే బాలాపూర్ సాయినగర్ బోనాల ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం అమరేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలో జరిగే ఆషాఢ, శ్రావణ మాస బోనాలను అందరూ భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. తొట్టెలు, ఘటాలు, ఫలహార బండ్ల ఊరేగింపుల్లో యువత సంయమనం పాటించి ఊరేగింపులు ప్రశాంతంగా జరిగే విధంగా సహకరించాలని అమరేందర్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో భాను ప్రసాద్, సన్నీ, రాజు తదితరులు పాల్గొన్నారు.